

ఉగాది కథల పోటీలలో ప్రైజ్ వచ్చిన

# "భావనా బంధం"

ఆంధ్ర జ్యోతి - 7-4-1972

విధిరాతను ఎలాగూ తప్పించలేం. జీవితాల్లో మిగిలిన సుఖ శాంతులను కూడా..... సెంటిమెంట్స్ చట్రంలో బిగించి హత్య చేయాలా?.....

- జయప్రద

"రా కన్నమ్మా!"

ఇంట్లో 'కన్‌సల్‌టేషన్' రూము తాలూకు 'స్ప్రింగ్ డోర్' కవతలగా, తచ్చాడుతున్న పాదాల ధ్వని నాకు బాగా పరిచితమైందే.

తలుపు నెట్టుకుని, తల వంచుకుని, మెల్లగా, నీరసంగా, నిర్వీర్యంగా నడచి వచ్చి, నా బల్లకెదురుగా, సర్వం కోల్పోయిన సాంధురాలిలా, నిల్చుంది నా పేషంటు కన్నమ్మ. ఎప్పటిలా ముక్కున ముక్కెర తళుక్కుమనేలా ముగ్ధమనోహరంగా నవ్వి 'నమస్కారం డాక్టరమ్మా!' అనలేదు ఆమె.

అననందుకు నేను నొచ్చుకోనూ లేదు. ఆ అందమైన పడుచుపిల్ల తాలూకు, వాలిపోయిన కనురెప్పల వెనక తొణికిసలాడే ముత్యాల్లాంటి కన్నీళ్ళను ఊహించు కోలేనంత, వివేక శూన్యురాలిని కాదు నేను.

"కూర్చో కన్నమ్మా."

ఆ అమ్మాయి కూర్చోలేదు. నీరు కావి పట్టిన సంచిలో నుండి నాలుగైదు రకాల ఖరీదైన మందులు తీసి నా "టేబిల్" మీద వుంచింది. అలా వుంచుతున్నప్పుడు, ఆమె నునుపైన చంపల మీదుగా, దాచుకున్న కన్నీళ్ళు పాదరసంలాగ దొర్లిపోయాయి.

"ఇవి మీ దగ్గర వుంచడమ్మా!"

నేను కొద్దిగా ముందుకు వంగి, మౌనంగా ఆమె భుజం మీద చెయ్యివేసి ఆమెను కూర్చోబెట్టాను. సర్వ బంధాల నుండి వంచించబడ్డ ఆ పసిపిల్లను, ఓదార్చే భాషకొరకు వెతుక్కుంటున్నాను. ఆమెకు భద్రంగా, ఒప్పచెప్పాల్సిన విలువైన వస్తువును, ఒప్పచెప్పలేకపోయిన, 'నా అశక్తతా దోషానికి, ఏ విధంగా క్షమాపణ వేడుకోవాలా!' అని యోచిస్తున్నాను.

"నిన్ను సంతోషంగా పంపలేకపోయాను కన్నమ్మా!"

ఆ పల్లెటూరి అనాగరికురాలు, నా కంఠంలోని మార్దవాన్ని గ్రహించింది. ఆమె నుండి నేను కోరేదేదో అర్థం చేసుకుంది.

"అమ్మా! మీరు నా కొరకు రాత్రనక, పగలనక పడ్డ శ్రమ నేను ఎరగనిదా? నా ఖర్మ అలా ఉన్నప్పుడు మీరేం చేస్తారమ్మా" కర్మ సిద్ధాంతపు నమ్మకంలోకి తన దురదృష్టాన్ని తేలిగ్గా నెట్టేసి లేచిందామె. నేనామెను వారించి కూర్చోమన్నట్టు సంజ్ఞ చేశాను.

ఆ బీదరాలి దగ్గరనుండి, ఆ మందులు స్వీకరించడానికి, నా మనస్సంగీకరించ లేదు. వాటిని కొనటానికి వాళ్ళెంత తంటాలుపడి వుంటారో, ఏమేమి కుదువపెట్టి వుంటారో నేనూహించుకోగలను. అవి నేను కన్నమ్మ బిడ్డకు వ్రాసిచ్చిన మందులు.

"చూడు కన్నమ్మా, మీ అక్క గర్భవతి అని చెప్పావు కదూ! కొన్ని ఆమె బిడ్డకు పనికొస్తాయి వుంచిపెట్టు. మిగతావి మెడికల్ షాప్‌లో తిరిగివ్వచ్చులే."

"వద్దు లేమ్మా! మీ దగ్గరకు నాలాంటి బీదరోగులు ఎంతో మంది వస్తూ వుంటారు. వాళ్ళకివ్వండమ్మా."

దగ్గర దగ్గర పాతిక రూపాయలు ఖరీదు చేసే మందులను అతి తేలిగ్గా, దానం చేస్తున్న, ఆమెవైపో క్షణకాలం చూచి, "నీకు నేనెప్పుడో, ఏవో మందులు ఊరికే ఇచ్చానని

ఇప్పుడు వీటిని నీ దగ్గర ఉచితంగా తీసుకోవడం నా కిష్టం లేదు కన్నమ్మా!" అన్నాను.

"అమ్మా!" మరి మాట్లాడలేనట్టు ఆగింది కన్నమ్మ.

"వాటిని చూస్తూ నేను బతకలేను, వుంచండమ్మా!"

ఆమె కంఠంలో కన్నీళ్ళు గర గరలాడాయి. అంతసేపూ ఆ సంభాషణను పొడిగించి ఆమె మనస్సును కష్టపెట్టినందుకు నన్ను నేను దూషించుకున్నాను.

"సరే ఏమైనా బాగలేకపోతే వచ్చి చూపించుకో" అలవాటైన తుది పలుకులు నా నాలుకమీద నుండి దొర్లాయి. ఆమె మౌనంగా లేచింది. నీరసంగా చేతులు జోడించింది. మెల్లగా నడుచుకుంటూ వెళ్ళిపోతోంది. సమస్తమైన కోరికల్నీ, ఆశల్నీ, నా దోసిట్లో పోసి, ఒంటరిగా వెనుదిరిగిపోతున్న ఆమెను చూస్తూ ఆత్మవిమర్శ చేసుకోసాగాను.

'ఈమెకు నిర్దేశించబడ్డ యీ నిస్సారమయిన జీవితానికి నేనెంతమాత్రం కారకురాల్ని?'

దగ్గర దగ్గర ఏడు నెలల క్రితం ముఖంమీద కొద్దిగా విచార చ్ఛాయలతో, నా 'నర్సింగ్ హోమ్'లో అడుగుపెట్టింది కన్నమ్మ వాళ్ళమ్మ చిన్నమ్మతో సహా. నేను పరీక్ష చేస్తున్నంతసేపూ నా ముఖంలోకి, పరీక్షగా, ఆతృతగా మౌనంగా చూస్తూ వుంది. అంతా అయ్యాక వాళ్ళమ్మవైపు చూస్తూ చెప్పాను.

"ఆమెకు మూడో నెల గర్భం. గర్భస్రావం అయ్యే లక్షణాలు కన్పిస్తున్నాయి. ఇక్కడ చేరిస్తే మందులిచ్చి గర్భం నిలవడానికి ప్రయత్నిస్తాను."

"ఇక్కడ వుంటే ఎంత ఖర్చవుద్దో!" అతి అమాయకంగా అడుగుతున్న చిన్నమ్మను, "నేను చెపుతాను రా" అని స్టాఫ్ నర్సు చేయి పట్టుకొని తీసుకెళ్ళింది బయటకు. స్టాఫ్ నర్సు చెపుతున్న బిల్ వివరాలు, చిన్నమ్మ నోటినుండి వచ్చిన "అమ్మో!" అనే శబ్దం, నా చెవులను దాటిపోలేదు. రెండు నిముషాల తర్వాత బెదురుచూపులు చూస్తూ కన్నమ్మ లోపలికి వచ్చింది.

"డాక్టరమ్మా కాదనకండి. నా గర్భం నిలపండి. ఎంత డబ్బయినా సరే. నేను తర్వాత ఈ గాజులు అమ్మి మీ ఋణం తీర్చుకుంటాను. మా అమ్మ ఇవ్వలేదు. మీరు దయతలచి నన్ను చేర్చుకోండమ్మా."

ఆ అమ్మాయి ఆతృతకు, ఆరాటానికి, ఆసక్తికీ కారణం వెతుకుతూ అడిగాను.

"పెళ్ళయి ఎంత కాలమైంది?"

"పెళ్ళయి నాలుగు నెలలయింది. ఆయన చనిపోయి రెండు నెలలయింది."

ఆ పిల్ల ఆ జవాబు చాలా నిర్వికారంగా చెప్పానని అనుకుంటే అనుకోవచ్చుగాక, ఆమె కంఠం మటుకు ఆమె మనసులోని వ్యధను దాచలేకపోయింది. ఆ పిల్ల జవాబు విని స్తబ్ధురాలినై అంతవరకు గమనించని సింధూర హీనమయిన ఆ అందమయిన పసిపిల్ల నుదుటి వంక చూస్తూ ఏమి మాట్లాడాలో తెలియని దానిలా వుండిపోయాను.

"అయన నాకెలాగూ దక్కలేదు. ఓ పసిగుడ్డు ఐనా నాకు తోడులేందే, ఈ బతుకును నేనెలా వెళ్ళమార్చేది చెప్పండి డాక్టరమ్మా!" నేను మాట్లాడలేదు. నేనే భరించలేని ఆ నిజాన్ని విన్నాక, ఇంకా నోరు విప్పి మరేదయినా మాట్లాడగల శక్తి నాలో లేదనిపించింది. ఆ స్తబ్దస్థితిలో ముద్దగట్టుకుపోయిన నన్ను రక్షించడానికి చిన్నమ్మ ఆ గదిలో ప్రవేశించి, చేతులు జోడిస్తూ అంది. "అపాటి శక్తి లేదులే తల్లీ. మందు లేమయినా పదిరూపాయల్లో రాసీండమ్మా. వాడుకుని వచ్చి చూపిస్తాము." నేనేమి జవాబు చెప్తానోనని ఆతృతగా, దీనంగా చూస్తోందా పిల్ల.

"మీరంత డబ్బివ్వక్కరలేదు. ఆమెను చేర్చు. ఇంటికి తీసుకెళితే నిలిచే గర్భం కాదది." చిన్నమ్మ నమ్మలేనట్టు క్షణంసేపు చూచి, 'దండాలమ్మా' అని స్టాఫ్ వెంట వెళ్ళిపోయింది.

నాలుగు రోజుల తర్వాత పూర్తి ఆరోగ్యవంతురాలై వెళుతున్న కన్నమ్మ కళ్ళల్లో కృతజ్ఞత నాకీనాటికీ మరుపుకురాదు.

ఆ తర్వాత జాగ్రత్తగా అప్పుడప్పుడు వచ్చి చూపించుకునేది కన్నమ్మ ప్రతి తడవా మౌనంగా పరీక్ష చేయించుకుని,

"పాప బాగుందమ్మా!" అని మాత్రం అడిగి, నమస్కారంచేసి వెళ్ళిపోయేది. మాట్లాడాల్సిన దానికంటే ఒక్క మాటకూడా ఎక్కువ మాట్లాడేది కాదు. తన బాధలను నివేదించుకోవడంగాని, వాటి ఉపశమనానికి మందులు వ్రాయించుకోవడంగాని చేసేది కాదు. ఆ పసిగుడ్డుకొరకు, తనేమయినా ఒళ్ళు నొప్పులు, కాళ్ళ వాపులులాంటి బాధలను, అనుభవించాల్సి వస్తే అదేమంత గొప్ప విషయం కాదన్నట్టు ప్రవర్తించేది. అన్నీ కనుక్కొని మందులివ్వాల్సి వచ్చేది.

* * * * *

ఒకరోజు అర్ధరాత్రి 'నర్సింగ్ హోమ్' నుండి 'ఫోన్ కాల్' వచ్చింది. "కన్నమ్మ నొప్పులతో వచ్చిందని, కేస్ కండక్ట్ చెయ్యమంటారా? మీరొస్తారా" అని అడుగుతుంటే నైట్ స్టాఫ్ నిమిషం ఆలోచించాను. నా అంచనా ప్రకారం కన్నమ్మకు మామూలు

కాన్పే అయిపోతుంది. అయినా ఆ విధి వంచితురాలికి, మాతృస్థానాన్ని జాగ్రత్తగా అప్పజెప్పి ఆమె విలువను కాస్త పెంచాలనే గాఢమైన కోర్కెతో 'నేను వస్తున్నానని' చెప్పి బయలుదేరాను. పరీక్షచేసి, అంతా బాగుండి కాన్పుకి ఆలస్యముంటే తిరిగి వచ్చేయొచ్చు అనే ఉద్దేశంతో.

"ఏం భయంలేదు కన్నమ్మా!" అంటూ తాపీగా పరీక్ష మొదలెట్టిన నేను బిడ్డ బొడ్డతాడు వేలుకు తగలడంతో, షాక్ తిని వెనక్కు లాగేసుకున్నాను.

"ఏం చేయాలిప్పుడు?"

ఇంకా పూర్తిగా ద్వారం ఏర్పడలేదు. బిడ్డ ప్రేగు ఇంకాస్త క్రిందకు దిగి నలిగిందంటే, బిడ్డ ప్రాణానికి ప్రమాదం. వెంటనే థియేటర్ రెడీ చేయమని పురమాయించాను. "థియేటర్" తలుపులు తెరుస్తున్న శబ్దం లీలగా విన్పిస్తోంది. నేను ఆలోచిస్తున్నాను. ఇంకొద్దిగా ద్వారం ఏర్పడితే, 'ఇన్‌స్ట్రుమెంట్స్' వేసి తొందరగా తీసెయ్యొచ్చు. పెద్ద ఆపరేషన్ చేసే అవసరం తప్పిపోతుంది. కాని ఇప్పుడు నిముషాలు చాలా విలువైనవి. ఒక్కొక్క క్షణం, బిడ్డ ప్రాణం మీద ఒక్కొక్క యమపాశం అవుతుంది. ఊహు. ఆలస్యం చేయడానికి వీలులేదు. తల్లి పొట్టమీద చిన్న మచ్చలేకుండా చేయడానికి పేషంటుకు పదిరోజులు బాధనుండి విముక్తినివ్వడానికి, బిడ్డ ప్రాణాల మీద ఎక్స్‌పరిమెంట్ చెయ్యడానికి వీలులేదు. వాటి విలువ అనంతమైంది.

ఇరవై నిముషాలు గడిచాయి. ఇంకా థియేటర్ రెడీ కాలేదు. నేనిచ్చిన 'ఇంజక్షన్' పవర్‌ని, పేషంటు అదృష్టాన్ని పరీక్షించదలచుకున్నాను. పరీక్ష చేశాను. నా ఆనందానికి అంతులేదు. వైద్యశాస్త్ర విజ్ఞాన పురోభివృద్ధికి మనస్సులోనే నా కృతజ్ఞత తెలుపుకున్నాను. ఒక్క నిముషంలో ఫోర్ సెప్స్ రెడీ చేసుకున్నాను. రెండు నిముషాల్లో బిడ్డను బయట పెట్టాను. కానీ ఆ బిడ్డను చూడగానే నా ఆనందం క్షణంలో జారిపోయింది. అనుకున్న దానికంటే చిన్నపాప ఒళ్ళంతా బ్లూ రంగులో వుంది. ఏడుపు లేదు. గబగబ బొడ్డులోకి ఇంజక్షన్ ఇప్పించాను. నోట్లో ముక్కులో వున్న "సెక్రిషన్స్" "సక్" చేసేశాను. ఆక్సిజన్ పెట్టాను. నోటిలో గొట్టం లాంటిది పెట్టి, దానికి ముందున్న బ్యాటరీలైటు కాంతిలో ఏమైనా ఉమ్మనీరుగాని, ఇంకేదయినా, ఊపిరి తీసుకునే గొట్టాలకు అడ్డుపడిందేమోనని చూచాను. అలాంటిదేమీ లేదు. ఇవన్నీ చేస్తూ ఆలోచిస్తున్నాను. కాన్పు అలసటలో నీరసంగా తల ఒక ప్రక్కకు తిప్పి, బిడ్డవైపు, నా వైపు మార్చి మార్చి చూస్తున్న ఆ తల్లికి బిడ్డను సజీవంగా అందించగలనా?

బిడ్డకు ఆర్టిఫిషియల్‌గా ఊపిరి అందించటానికి అంతకంటే ఎక్కువగా

పరికరాలులేని నా ఆర్థిక లోపాన్ని నిందించుకున్నాను. తర్వాత చిన్న గాజు గుడ్డ నోటికి అడ్డంగా పెట్టి, నోటితో బిడ్డ ఊరిపితిత్తుల్లోకి గాలి ఊదటం ప్రారంభించాను. నా ఊపిరితో బిడ్డకు ఊపిరి తెప్పించడానికి ప్రయత్నిస్తున్నాను.

నేనివన్నీ చేస్తున్నప్పుడు, నా ముఖ కవళికల్ని బట్టి, బిడ్డ చైతన్య హీనమైన పరిస్థితిని బట్టి డ్యూటీలో చేరినప్పుడే నేనిచ్చిన ఇన్‌స్ట్రక్షన్స్ ప్రకారం బయటకెళ్ళి కన్నమ్మ తల్లితో చెప్పింది నర్సు. 'తల్లి బాగుంది. బిడ్డ పరిస్థితి బాగాలేదు. ఎంత చేసినా ఊపిరి అందడం లేదు' అని.

"పోనీలేమ్మా! పెద్ద ప్రాణం సుఖంగా వుంటే అంతే చాలు" బయటనుండి ఒక రకమైన నిర్వికారమైన సంతృప్తితో కూడిన కంఠస్వరం విన్పిస్తోంది.

'ఊహు అలా జరగడానికి వీలులేదు. ఈ బిడ్డ బ్రతికి తీరాలి.'

'అయన నాకెలాగూ దక్కలేదు. ఓ పసిగుడ్డయినా నాకు తోడులేందే యీ బ్రతుకునెలా వెళ్ళమార్చేది చెప్పండి డాక్టరమ్మా!' అని ఒకనాడు నన్ను దయనీయంగా వేడుకున్న ఆ పసిపిల్ల మసకబారిన బ్రతుకును పూర్తిగా అంధకారం చెయ్యడానికి నాకు హక్కులేదు. అలా అనుకున్న నాలో చైతన్యం మరింత ప్రాణం పోసుకుంది. నోటితో కంట్రోల్డ్‌గా గాలి ఊదుతున్నాను. నా నోటితోపాటు నా మెదడు కూడా పని చేస్తోంది.

తన భావి సుఖమయ జీవితం తాలూకు ఏకైక ఆశ నుండి... తలుచుకోగానే తన నరాల్లో ప్రవహించే వాత్సల్యం నుండీ.... కేరింతల మాధుర్యం నుండీ, తనని ఊపిరి సలుపుకోనియ్యని మధుర సేనలనుండీ... 'అమ్మా!' అనే అతి మధురమూ లోభనీయమూ అయిన పిలుపునుండి... అత్యున్నతమైన మాతృస్థానపు విలువనుండీ, తన బిడ్డ ఆరోహణపు గర్వాతిశయం నుండి... తనదంటూ 'ఇది వుంది' అనే ధీమానుండి తన బ్రతుకు తాలూకు సార్థకతనుండి... తన అంతిమయాత్ర నాడు ఇన్ని కన్నీళ్ళు కార్చగలిగే, రక్తబంధముందనే అనంతమయిన సంతృప్తినుండి... వంచించి కేవలం బ్రతకాలి గనుకే బ్రతుకుతున్న యంత్రంగా మార్చడానికేనా ఆమె ప్రాణం చల్లగా వుండాలి? అందుకు మాత్రమేనా నా సమర్థతకు నేను సంతోషించాలి?

నా చేతుల్లో, నా ఊహల మధ్యగా, ఉన్నట్టుండి ఊపిరితిత్తులు నాకు శ్రమ తగ్గించి, తమ బాధ్యతలను తాము నెరవేర్చసాగాయి. క్రొత్త గోళంలోకి అడుగుపెట్టిన గంట తర్వాత పాప కెవ్వుమంది.

* * * * *

"వెళ్ళొస్తాను డాక్టరమ్మా!" ఉలిక్కిపడ్డాను. తలుపు దగ్గర క్షణం ఆగి నా వీడ్కోలు తీసికొని వెళ్ళిపోయింది కన్నమ్మ. నా టేబిల్ మీద ఎదురుగా వున్న మందుసీసాలు, ఇంజక్షను బుడ్లు నన్ను వెక్కిరించినట్లనిపించాయి. వాటిని తీసి డ్రాయరులో దాచేశాను గాని, వాటి తాలూకు ఊహలనుండి మటుకు తప్పించుకోలేకపోయాను.

* * * * *

రోజూ రౌండ్సులో, బిడ్డ క్షేమ సమాచారాలను గురించి తెలుసుకోవడంలో, బిడ్డను పరీక్షించడంలో ఎక్కువ శ్రద్ధ తీసుకొనేదానిని. ఒక రకంగా తల్లి ఆరోగ్యం గురించి పూర్తిగా నిర్లక్ష్యం చేశాననే చెప్పాలి. మూడవరోజు సాయంత్రం బిడ్డ చేతులూ, కాళ్ళూ స్వాధీనం లేనట్లు ఆడిస్తోందని చెపితే చూడటానికి వెళ్ళాను. ఆ ఆడించటం ఆడించటం కొన్ని నిమిషాల్లో ఒళ్ళంతా కదిలిపోయేలా 'ఫిట్స్'లోకి దించేసింది. నా దగ్గరున్న ఇంజక్షనిచ్చి మరో రెండు ఇంజక్షన్లు మందులు వ్రాసి ఇచ్చాను. తర్వాత వాడటానికి.

ఫిట్స్ తగ్గినట్టే తగ్గి రాత్రికి ఎక్కువయ్యాయి. నా పోస్టు గ్రాడ్యుయేట్ మేధకు అందిన వైద్య పరిజ్ఞానమేదీ ఆ బిడ్డను రక్షించలేకపోయింది. అఖరున... ఇంజక్షనిస్తున్న నా చేతుల్లోకి ఒరిగిపోయి అఖరి శ్వాస తీసుకొంది కన్నమ్మ బలహీనపు బిడ్డ. బతికిందను కొన్న అపురూపమయిన బిడ్డ తాలూకు వ్యవధిలేని మరణంతో మతిపోయిన నేను ఆ తల్లిని ఒదార్చే శక్తిలేక గబగబ వచ్చి కారెక్కాను.

పెళ్ళయిన పది పన్నెండేళ్ళ తర్వాత అపురూపంగా వచ్చిన గర్భాలు పోవడమో, జన్మించిన శిశువు చనిపోవడమో జరిగితే, అలాంటి వాళ్ళను ఓదార్చే భాష నా దగ్గరుండేది. 'పర్వాలేదు. నిరాశ పడొద్దు, ఒక్క మారు గర్భమొస్తే మరలా మరలా వస్తుంది. ఈ మారు గర్భమొచ్చినప్పుడు మొదటి నుండి వచ్చి చూపించుకో' అని ఓదార్చి పంపేదాన్ని. కానీ ఈ పిల్లను ఏ భాషా భావంతో ఓదార్చగలను?....

* * * * *

రాత్రి తొమ్మిది గంటలకు నర్సింగ్ హోమ్ నుండి ఇంటికి వచ్చి నా 'పర్సనల్' తాళాలు వేయడానికి డ్రాయరు తెరుస్తున్న నా చేతులు పామును తాకినట్లు బెదిరిపోయి వెనక్కు వచ్చేశాయి. ఎదురుగుండా కన్నమ్మ ఎవరికైనా ఇమ్మని ఇచ్చిన మందుల్ని ఏ పసిబిడ్డకైనా ఇవ్వాలనుకున్నప్పుడు.... ఇంజక్షనిస్తున్న నా చేతుల్లో ఒరిగిపోయి అఖరి శ్వాస తీసుకున్న కన్నమ్మ బలహీనపు బిడ్డ గుర్తుకు వచ్చి చేతులు వణికేవి. అందుకని ఇప్పటికి ఆ మందులకు స్థానభ్రంశం కలగలేదు.

* * * * *

"పిన్నీ! తొందరగా రా. హరిణికి ఫిట్స్ వస్తున్నాయి." అర్థరాత్రి గాఢనిద్ర నుండి లేచి పరుగెట్టాను. అత్తయ్య ఒడిలో పది నెలల హరిణి ఒంపులు తిరిగిపోతోంది. నుదుటి మీద చెయ్యి వేశాను. చురుక్కుమంది. ప్రొద్దున్నుంచి జ్వరంగా వుంది. డ్రాప్స్ వేసి హాస్పిటల్ కెళ్ళాను. ఇప్పుడు జ్వరం కాస్త ఎక్కువయి ఫిట్స్‌లోకి దింపిందన్న మాట. గాభరాగా వచ్చి కావాల్సిన ఇంజక్షన్ కొరకు డ్రాయర్సంతా వెతికాను. సామాన్యంగా నా శాంపిల్స్, కొన్ని మందులు అన్నీ నర్సింగ్‌హోమ్‌లోనే వుంటాయి. కావలసిన ఇంజక్షను దొరకక నిరాశాగా, విసుగ్గా, ఆందోళనగా డ్రాయరు మూస్తున్న నాకు ఎదురుగా స్టేర్ చేస్తూ, కన్నమ్మ ఇచ్చిన మందుల్లో నాకు కావల్సింది కనిపించింది. దానిని అందుకోవ టానికి చాచిన నా చెయ్యి వణికింది. వెంటనే.... ఇంజక్షనిస్తున్న నా చేతులలో ఒదిగిపోయి ఆఖరిశ్వాస తీసుకొన్న కన్నమ్మ బలహీనపు బిడ్డ గుర్తొచ్చి, పాముకాటు తిన్నట్టు చెయ్యిలాగేసుకున్నాడు.

"బాబ్జీ!... నర్సింగ్‌హోమ్‌కి ఫోన్‌చేసి.... వద్దు ఆలస్యమవుతుంది. నువ్వు కారులో వెళ్ళి స్టాఫ్‌నడిగి ఈ మందు తీసుకురా" ప్రిస్కిప్షన్ డ్రైవరు చేతికిచ్చి పాపకొరకు పరుగెట్టాను. ఒంపులు తిరిగిన మనుమరలివైపు భయంగా చూస్తూ వుంది అత్తయ్య. ఆతృతగా అడిగారు మావయ్య.

"ఏమ్మా! పాపకి ఇంజక్షనివ్వు. తగ్గలేదు చూడు."

"నా దగ్గర లేదు మామయ్యా! బాబ్జీని తెమ్మని పంపాను."

"పాపకి అవసరమయిన మందులయినా దగ్గరుంచుకోకపోతే ఎలా అమ్మా?" విసుగ్గా, కాస్త కోపంగానే అన్నారాయన. పదహారు సంవత్సరాల మా చిన్న మరిది తర్వాత ఆ ఇంట్లో పారాడిన హరిణి అంటే ఆయనకు మహా మమకారం. ఎప్పుడూ నన్ను పల్లెత్తుమాట అనని ఆయన పాప బాధ చూడలేక కోప్పడ్డారనే విషయం నాకు తెలుసు. నా బిడ్డను అపురూపంగా చూచుకునే ఆయన వాత్సల్య భావాన్ని గుర్తింపుకు తెచ్చే ఆయన కోపం నన్ను బాధించలేదు.

ఒక్క నిముషం గడిచింది. పాప ఒంపులు కాస్త తగ్గినట్టే తగ్గి, ఎక్కాయి. మరో అర నిముషం గడిచింది. నాకది పదియుగాల్లా వుంది.

బాబ్జీ ఇంకా రాలేదు. ఒకవేళ... రైల్వేగేట్ వేసేయలేదుగదా. ఐదు నిముషాల కొకమాటు గేటు వేస్తూ వుంటారు. గేటువేస్తే నర్సింగ్ హోమ్‌కి వాహనం వెళ్ళడానికి మరో మార్గం లేదు. దిగి మరో వాహనం ఎక్కాలి. రిక్షా దొరకక పోతే నడిచే వెళ్ళాల్సి ఉంటుంది. అంతవరకు పాప ఇలా వుండాల్సిందేనా? వెంటనే వంటవాడికి చీటిఇచ్చి నైట్ అండ్ డే మెడికల్ షాపుని తరిమాను.

మరో నిముషం గడిచింది. పాప ఒంపులు తగ్గటం లేదు. ఆడబిడ్డ - అమృత ఐస్ నీళ్ళు తెచ్చింది "స్పంజ్‌బాత్" చెయ్యడానికి.

"చూడు యమునా! బాగా వెతుకు. ఎక్కడో ఒక దగ్గర ఆ మందు వుండక పోతుందా? బిడ్డ చూడు ఎలా డీలా పడిపోతోందో" అత్తయ్య తొందర చేస్తోంది. నా కళ్ళ ముందు ఒంపులు తిరిగే బిడ్డ.... డ్రాయరులో కన్నమ్మ ఇచ్చిన మందు - పాపను ఆ స్థితిలో చూస్తూ చేతులు ముడుచుకుని కూర్చునే శక్తి నాకు లేకపోయింది.

"నాన్సెన్స్.... యూస్‌లెస్ సెంటిమెంట్"... లేచాను. కన్నమ్మ ఇచ్చిన మందులోడ్ చెయ్యడానికి సిరంజ్ తీసాను. వెంటనే నీడలా... ఇంజక్షనిస్తున్న నా చేతుల్లోనే ఒరిగి పోయి, ఆఖరి శ్వాస తీసుకున్న కన్నమ్మ బలహీనపు బిడ్డ మసక మసగ్గా కళ్ళముందు కదలి నన్ను నిర్వీర్యురాలిని చేసింది. సిరంజ్ జారిపోయింది. నా "సెంటిమెంట్స్" తాలూకు పెనుభూతంలా పగిలిన గాజు ముక్కలు నా చుట్టూ పరుచుకున్నాయి. అవి పాదంలో గుచ్చుకున్నా లెక్క చెయ్యకుండా వాకిట్లోకి పరుగెట్టాను. నా కనుచూపు మేరలో బాబ్జీగాని, వంటవాడుగాని కన్పించలేదు. పాప దగ్గరకు పరుగెట్టాను. అలసిపోయిన పాప మెడ వాలిపోతోంది. భయంతో నా మెదడు మొద్దుబారిపోయింది. మగలా స్టెరిలైజర్ దగ్గరకు పరుగెట్టాను. ఇంకొక 'సిరంజ్' తీసి మందు 'లోడ్' చేశాను. పాప దగ్గరకు తీసుకెళ్ళాను. స్పిరిట్‌తో తొడ దగ్గర రాసాను. ఇంజక్షనివ్వబోయాను. నా చేతులు వణికాయి.

"బాబ్జీ వచ్చాడా?" అత్తయ్య ప్రశ్న విన్పించింది. పిచ్చిగా తలూపాను.

"ఇచ్చెయ్ తల్లీ, తొందరగా ఇచ్చెయ్." సూదిమొ పాప శరీరం మీద తగిలింది. ఇంజక్షనిస్తుండగానే, నా చేతుల్లో ఒరిగిపోయి ఆఖరి శ్వాస తీసుకున్న కన్నమ్మ బలహీనపు బిడ్డ నా మనోవీధిలో మెదిలింది. నా చేతులు పాప కంటే ఎక్కువగా వణికాయి.

"అదేమిటి వదినా నీ చేతులలా వణుకుతున్నాయి. హరికి నువ్వు ఇంజక్షనివ్వ లేవులే ఇలా ఇవ్వు" మెడిసిన్ చదువుతున్న పెద్దమరిది నా చేతిలో సిరంజ్ లాక్కున్నాడు. ఇంజక్షన్ ఇచ్చేస్తున్నాడు... ఇచ్చేశాడు... అయిపోయింది. కన్నమ్మ బిడ్డ రక్తంలో ప్రవ హించి, ఆ రక్త ప్రవాహాన్ని హఠాత్తుగా ఆపేసిన ఆ మందు నా బిడ్డ రక్తనాళాల్లో ప్రవహించ బోతోంది. ముద్ద కట్టుకుపోయి, చైతన్య హీనురాలనై, గబగబ శ్వాస తీసుకుంటున్న పాప ఎదవైపే చూస్తున్నాను కళ్ళప్పగించి.

పాపకు ఇంజక్షనిచ్చి రెండు నిముషాలయింది. ఇంకొక నిముషం.... మరో నిముషం.... ఏమవుతుంది? పాప ఎద ఎగరడం ఆగిపోతుందా? నాడి ఆడడం నిలిచి పోతుందా?

అదేవిటి?.... అదేవిటి? పాప చేతులు, కాళ్ళు అంత నిశ్చలంగా అయిపోతున్నాయేం? పాప శరీరం చైతన్యహీనమై పోతుందేం? శ్వాస పీల్చుకుంటుందా అసలు? అయ్యో పాప కళ్ళు మూతలు పడిపోతున్నాయి. "హరిణీ! పాపా! ఏమైంది? ఇటు చూడు హరీ!... పాపా హరిణీ" పాపను చేతుల్లోకి తీసుకుని కుదిపేశాను. నాకు స్పృహ పోతున్నట్లనిపిస్తోంది. ఈ నాలుగు నిముషాల స్వల్పవ్యవధిలో, నేననుభవించిన మానసిక కల్లోలం తాలూకు నరాల బలహీనత నన్ను సంపూర్ణంగా అశక్తురాల్ని చేసింది.

"చూడు చూడు... అమ్మాయి అలా అయిపోతోందేమిటో చూడు." మామయ్య మాటలు లీలగా విన్పిస్తున్నాయి.

"లేదు లేమ్మా యమునా! పాపకి తగ్గింది చూడు... ఇటు చూడు" అత్తయ్య పాపని మరిదికిచ్చి నన్ను పట్టుకుంటున్న దృశ్యం మసగ్గా కన్పిస్తోంది. క్రొత్త వ్యక్తి చేతుల్లో కెళ్ళిన హరిణి కెవ్వున ఏడ్చింది. పూర్తిగా స్పృహ తప్పి పోకుండానే కోలుకున్నాను. బలవంతాన కళ్ళు తెరిచి పాపను చూచాను. పాప చేతులు చాచింది. ఎత్తుకొని గుండెలకు హత్తుకొన్నాను. హృదయం తేలిక పడగా, శరీరానికి చైతన్యమొచ్చింది. లేచి జ్వరం తాలూకు ఉధృతం తగ్గటానికి బాబ్జీ తెచ్చిన ఇంజక్షను కూడా ఇచ్చాను. చాలా సేపటికి జ్వరం తగ్గి నా ఒడిలోనే నిద్రలోకి జారిపోయింది హరి. అర్ధరాత్రి సమీపిస్తుండగా, ఆందోళన తగ్గి అందరూ నిద్రపోయారు.

నాకు ఎంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు. ఇంజక్షను మత్తులో, ఒళ్ళు మరచి నిద్రపోతున్న హరిని కళ్ళప్పగించి చూస్తూ కూర్చున్నాను. కనురెప్పలు వాలితే, ఏమవుతుందో అన్నంత భయంగా... పరీక్షగా... వద్దనుకున్నా, తప్పని పరిణామాన్ని ఊహిస్తూ దాని కొరకు, గుండెలు చిక్కబట్టుకుని, నిరీక్షిస్తున్నట్టుగా చూస్తున్నాను. నన్ను అధీరురాలిని చేస్తున్న మూఢత్వాన్ని ప్రక్కన పెట్టడానికి నేను చేస్తున్న ప్రయత్నాలు నాకు వీసమెత్తు సహాయం చేయకపోగా, కన్నమ్మ బిడ్డ తాలూకు తలపులకు నన్ను మరీ దగ్గరగా చేరుస్తున్నాయి.

"బాబ్జీ వచ్చేదాకా ఆగుండాల్సింది... ఆగుండాల్సింది." ఆ నిశిరాత్రిలో అర్థవంద సార్లయినా అనుకొనుంటాను. శారీరకంగానూ, మానసికంగానూ కూడా అలసిపోయిన, నా కనురెప్పలు బరువుగా వాలిపోతున్నాయి. వాటిని బలవంతంగా పైకెత్తి పాపను పరీక్ష చేస్తున్నాను నేను.

నిద్రలో ఉలిక్కిపడింది పాప. నా చెయ్యి చటుక్కున హరి నాడిమీద పడింది. నాడి తాలూకు స్పర్శ నాకు తెలియలేదు. వేళ్ళు నలుపుకున్నాను. మరలా చూశాను నిదానంగా. నాడి బలహీనంగా వున్నట్లనిపించింది. రక్తపు పోటు చూశాను. బాగుంది.

మరలా నాడి చూశాను. ఈసారి అది క్రమబద్ధంగా, దృఢంగా కొట్టుకుంటున్నట్లని పించింది. స్టెత్‌పెట్టి ఊపిరితిత్తులు పరీక్ష చేసాను. వాటి పని అవి సక్రమంగా, ఆరోగ్యంగా నెరవేరుస్తున్నాయి. సంతృప్తిగా కళ్ళు మూసుకున్నాను. నిద్ర... మూసుకున్న కనురెప్పల మీదుగా పరచుకోబోతుంది... నా చేతుల్లో ఒరిగిపోయి ఆఖరి శ్వాస తీసుకున్న కన్నమ్మ బలహీనపు బిడ్డ మూసుకున్న నా కనురెప్పల్ని ఛేదించి, కనుపాపల్లో జొరబడింది.

మరలా పాపకి ఫిట్స్ వచ్చింది. ఒళ్ళంతా కదిలిపోతోంది. ఇంజక్షనిచ్చాను. పాపని కన్నమ్మ అందుకుంది. కన్నమ్మ చేతిలో పాప ఒరిగిపోయి ఆఖరి శ్వాస తీసుకుంది. 'నా పాప నీ చేతిలో చచ్చిపోయింది నీ పాప నా చేతిలో...' విరగబడి నవ్వుతోంది కన్నమ్మ. ఉలిక్కిపడి లేచాను. పాప వాళ్ళ నాన్నమ్మ ఒడిలో చేరి, భాషకందని భావంతో కబుర్లు చెప్తోంది.

* * * * *

నేను చాలా చిన్నగా వున్నప్పుడు తాతయ్య పొట్టమీద కూర్చుని చాలా ఆసక్తిగా కథలు వినేదాన్ని.

అనగనగా ఒక రాజు. ఆ రాజుకు చాలా కాలానికి మగబిడ్డ కలుగుతాడు. రాజుగారు వంశోద్ధారకుడు పుట్టాడనే ఆనందంతో వుండగా, జ్యోతిష్కుడు, ఆ బిడ్డ మాతృగండంలో పుట్టాడనీ, తల్లి కళ్ళు తెరచి ఆ బిడ్డను చూచిన తక్షణం మరణిస్తుందని చెప్తారు. జ్యోతిష్కం మీద నమ్మకంలేని రాజుగారు దానిని తేలిగ్గా కొట్టిపారేస్తారు. కాని నిముషాలు గడిచే కొద్దీ రాజుగారిలో, ఒక రకమైన సంశయం. అత్యంత ప్రీతిపాత్రు రాలయిన భార్య ప్రాణాలమీద ప్రయోగం చేయడానికి ఆయన మనసు అంగీకరించ లేదు. వెంటనే పొత్తిళ్ళలో బిడ్డ తల్లినుండి శాశ్వతంగా దూరం చేయబడుతుంది.

ఆ తర్వాత వారపత్రికలమీద మోజు పెరిగిన రోజులలో ఇలాటివి చాలా చదివేదాన్ని.

కోడలు కాలిడిన ముహూర్తాన, ఆ ఇంటి యజమాని చనిపోయి, తనకు వైధవ్యం ప్రాప్తించిందనే వ్యథతో కోడలు అందుకు కారణమనే మూఢత్వంతో, కోడల్ని హింసించే అత్తగారు, ఉన్న ఒక్కగానొక్క పట్టుపావడాను అది ధరించినప్పుడు బిడ్డకు జబ్బు చేసిందనే నమ్మకంతో, తల్లి ఆ పట్టుపావడాను ఎవరికో దానంచేస్తే కంటికి కడివెడుగా ఏడ్చే పసిపిల్ల... ఇంకా ఎన్నో గుర్తులేదు.

తర్వాత... మెడిసిన్ చదివే రోజుల్లో... కళ్ళారాచూచిన ట్రాజడి... ఇంటి ప్రక్కన

ఒక చిన్న పెంకుటింటిలో ఒక టీచరు, పిల్లలు వుండేవారు. ఆయన భార్య పెళ్ళయిన నాలుగేళ్ళకు చనిపోయింది. ఆమె మంచి చిత్రకారిణి పెళ్ళికి ముందు రాధాకృష్ణులను చిత్రించి ఆ పటాన్ని ఆయనకు బహూకరించిందట ఆమె. అసలా చిత్రమే వాళ్ళిద్దరూ దంపతులు కావడానికి కారణమంటాడాయన ఆమె బ్రతికుండే రోజులలో... ఒక నెల జీతాలురాక, ఆ చిత్రాన్ని అమ్మేయబోతే, ఆమె సెంటిమెంట్స్ దెబ్బతిని, పది రోజులు ఆయనతో సరిగా మాట్లాడలేదు. తన ప్రేమను భర్త నిర్లక్ష్యం చేశాడనే ఉద్దేశంతో. ఆమె పోయినప్పటినుండి దానిని ప్రాణంతో సమానంగా చూచుకునేవాడు టీచరు. ఒకరోజు రాత్రి ఇంటికి నిప్పంటుకుంది. అందరూ బిలబిలమంటూ బయటకువచ్చి ప్రాణాలు మటుకు దక్కించుకున్నారు. అగ్నిదేవుడు ఆ పూరింటి మీద విలయతాండవం చేస్తున్నాడు. ఉన్నట్టుండి ఆ పటం గుర్తుకొచ్చిందాయనకు. ఎవరెంత వారించినా వినకుండా, ఆ చిత్రం కొరకు ఆవేశంగా మంటల్లో దూకి కొన్ని నిముషాలలోనే భార్యను చేరుకున్నాడు.

ఆ రోజులలో.... తండ్రి మానసిక బలహీనతకు బలై తల్లి ప్రేమనుండీ వంచించబడి, వేరుగా పెరుగుతున్న యువరాజు కొరకు కన్నీళ్ళు కార్చాను. అత్తగారి మూఢత్వానికి అకారణంగా హింసించబడుతున్న కోడలి కొరకు బాధపడ్డాను. తల్లి 'సెంటిమెంట్స్'కు ఫలితంగా ఉన్న ఒక్కగానొక్క పట్టుపావడా పోగొట్టుకున్న ఆ బీద పసిపిల్లమీద జాలి పడ్డాను. చనిపోయిన భార్య 'సెంటిమెంట్స్' కొరకు వున్న బిడ్డలను అనాధలను... చేసిన టీచరు అవివేకానికి కోప్పడ్డాను.

కానీ... కానీ... ఈ రోజు నేను చేసిందేమిటి?

పిచ్చి సెంటిమెంట్స్‌ను పట్టుకొని వేలాడి, వేయి శంకలతో వేసారిపోయి... కన్న బిడ్డ కొన్ని నిముషాల అదనపు బాధకు కారణభూతురాలనయ్యాను. 'సెంటిమెంట్స్' చట్రంలో బిగుసుకుపోయి ఊపిరాడక అల్లాడాను. నా మేధస్సుకు, విచక్షణకూ, అతీతంగా, నా భావాలకు నేనే బంధీనై అందమైన... గజ్జెల సంకెళ్ళతో నిస్సహాయంగా నిలిచిపోయాను.

'అది మనః కల్పన తాలూకు సెంటిమెంట్స్‌గానీ, మూఢత్వంగానీ, అజ్ఞానంగానీ, కొన్ని జతల కళ్ళల్లో కన్నీరు నిలిపేది ఏదైనా అది వాంఛనీయమయినది కాదు.' నిట్టూర్చి తలెత్తాను. నా దోషాన్ని తేలికగా క్షమించేసినట్టు, నోరంతా తెరచి, నవ్వుతూ చెయ్యి చాపింది పాప.